# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-12-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **గిరిజన సాధికారతకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జుయల్ ఓరమ్ వెల్లడి.**

2. **వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతకు రైతులు ప్రాధాన్యమివ్వాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

3. **30 శాతం పచ్చదనం ఉండేలా రాజధాని అమరావతిని నిర్మిస్తున్నామన్న పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ.**

4. **విశాఖపట్నం ఉక్కు కర్మాగార పరిరక్షణకు చర్యలు తీసుకుకోవాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసిన విశాఖ పార్లమెంటు సభ్యులు శ్రీభరత్.**

5. **అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం.**

==========================

గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఒక ప్రైవేటు విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న 6వ జాతీయ ఏకలవ్య ఆదర్శ పాఠశాలల సాంస్కృతిక, సాహిత్య కళా ఉత్సవ్ –ఉద్భవ్ 2025 కార్యక్రమాన్ని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జుయల్ ఓరమ్ ఈరోజు ప్రారంభించారు. గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ విద్యా సంస్థల సంఘం ఆధ్వర్యంలో ఈరోజు నుంచి మూడు రోజులపాటు పలు పోటీలను నిర్వహిస్తారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. గిరిజన సాధికారతకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. గిరిజన విద్యార్థుల విద్యా నైపుణ్యాలకు ఏకలవ్య పాఠశాలలు ఉపయోగపడుతున్నాయని తెలుపుతూ...

..వాయిస్.. 35 సెకన్లు

అంతకుముందు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడుతూ.. గిరిజనుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

..వాయిస్..30 సెకన్లు

-------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు తూర్పు గోదావరి జిల్లాలో పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా జిల్లాలోని గోపాలపురం నియోజకవర్గంలోని నల్లజర్లలో ప్రజావేదిక వద్ద ఏర్పాటు చేసిన రైతు స్టాళ్ళను పరిశీలించారు. అనంతరం రైతులతో ముఖ్యమంత్రి సంభాషిస్తూ...వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతకు ప్రాధాన్యమిస్తూ సాగుచేయాలన్నారు.

..వాయిస్.. 27 సెకన్లు

రైతులతో సమావేశం అనంతరం ముఖ్యమంత్రి 'రైతన్నా మీకోసం' ముగింపు కార్యక్రమంలో పాల్గొని, ప్రసంగిస్తారు.

---------------------------

స్క్రబ్ టైఫస్ జ్వరాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. రాష్ట్రంలో ఈ కేసుల నమోదు, చేపట్టాల్సిన చర్యలపై వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారులతో శ్రవణ మాధ్యమం ద్వారా మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ జ్వరం వచ్చిన వారికి ఇచ్చే డాక్సిసైక్లిన్, అజిత్రోమైసిన్ మందులను ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని తెలిపారు. దీనిపై ప్రజలు ఆందోళన చెందొద్దని, జ్వరం వచ్చి మూడు రోజులైన తగ్గకపోతే వైద్య పరీక్షలు చేయించుకోవాలని మంత్రి సూచించారు.

---------------------------

30 శాతం పచ్చదనం ఉండేలా రాజధాని అమరావతిని నిర్మిస్తున్నామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. అమరావతిలో మంత్రి ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ.. హరిత నగరంగా రాజధాని ఉండేలా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. 190 ఎకరాల్లో శాకమూరులో ఉద్యానవనాన్ని ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలియజేస్తూ..

..వాయిస్.. 26 సెకన్లు

---------------------------

విశాఖపట్నం ఉక్కు కర్మాగార పరిరక్షణకు చర్యలు తీసుకుకోవాలని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామిని విశాఖ పార్లమెంటు సభ్యులు ఎం. శ్రీభరత్ కోరారు. ఢిల్లీలో కేంద్రమంత్రితో ఆయన ఈ రోజు సమావేశమై విశాఖపట్నం ఉక్కు కర్మాగారానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. కర్మాగానికి సంబంధించిన విధానపరమైన నిర్ణయాలు ఆలస్యమవకుండా ఉండేందుకు పూర్తి స్థాయి చైర్మన్, డైరెక్టర్లను నియమించాల్సిన అవసరం వుందని కేంద్రమంత్రికి వివరించారు. తమ ప్రతిపాదనలపై కేంద్ర మంత్రి కుమారస్వామి సానుకూలంగా స్పందించారని భరత్ తెలిపారు.

---------------------------

కాశీ, తమిళనాడు మధ్య పురాతన సంబంధాన్ని తెలిపేందుకు నిర్వహిస్తున్న 'కాశీ తమిళ సంగమం' నిన్నటి నుంచి ప్రారంభమైంది. ఇందులో భాగంగా తమిళనాడు నుండి మొదటి ప్రతినిధి బృందం కాశీ చేరుకుంది. ఈ ప్రతినిధి బృందంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు సహా 216 మంది సభ్యులు ఉన్నారు. ఈ బృందం ఈరోజు కాశీలోని శంకరాచార్య మఠాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మఠంలోని ప్రాచీన తమిళ ప్రతులను

పరిశీలించారు. అనంతరం బనారస్ హిందూ విశ్వవిద్యాలయలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు.

---------------------------

విశాఖపట్నం భాగస్వామ్య సదస్సు ద్వారా రాష్ట్రానికి 13.25 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి అన్నారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలోని క్యాంప్ కార్యాలయంలో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ 32 సెకన్లు

---------------------------

అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. 1992లో ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానం మేరకు ప్రతీ ఏటా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని డిసెంబర్ 3వ తేదీన సభ్య దేశాలు నిర్వహించుకోవడం ఒక ఆనవాయితీగా వస్తోంది. దివ్యాంగుల హక్కులు, వారికి సమాజంతో పాటు ప్రభుత్వాలు అందించవలసిన సంక్షేమ పథకాలను తెలియజేసే విధంగా ప్రపంచవ్యాప్తంగా పలు కార్యక్రమాలు జరుగుతున్నాయి. కాగా దివ్యాంగుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సుగమ్య భారత్ అభియాన్– యాక్సెసబుల్ ఇండియా క్యాంపెయిన్ –ఏఐసీ ఈ రోజుతో 9 ఏళ్లు పూర్తి చేసుకుంది.

---------------------------

రెండవ దశ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ –సర్ లో భాగంగా ఇప్పటివరకు 50 కోట్ల 85 లక్షలకు పైగా కౌంటింగ్ స్లిప్పులను ఓటర్లకు పంపిణీ చేసినట్లు కేంద్ర ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ దశలో దాదాపు 51 కోట్ల మంది ఓటర్లలో ఇప్పటివరకు దాదాపు 40 కోట్ల ఫారమ్‌లు అంటే 99.78 శాతం డిజిటలీకరణ చేసినట్లు తెలిపింది. ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరి, లక్షద్వీప్, అండమాన్ నికోబార్ దీవులు వంటి తొమ్మిది రాష్ట్రాలు మూడు కేంద్రపాలిత ప్రాంతాలలో రెండవ దశ జరుగుతుంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న తుది ఓటరు జాబితా ప్రచురణతో ఓటర్ల జాబితాల సవరణ ముగుస్తుందని ఎన్నికల సంఘం తెలిపింది.

---------------------------

నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతోన్న వాయుగుండం పుదుచ్చేరి వైపు దిశ మార్చుకుందని, ఇది ఈరోజు తీవ్ర అల్పపీడనంగా బలహీనపడిందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీవర్షాలు కురుస్తున్నాయని, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, రాయలసీమ జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం పేర్కొంది.

=====================